సకాలంలో రీ సర్వే పూర్తి చేయండి

- ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: సకాలంలో రీ సర్వే పూర్తి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో జరిగిన రీ సర్వే సమీక్షలో పిఒ మాట్లుడుతూ, రీ సర్వే ప్రగతిని పెంపొందాలని, అన్ని రోవర్స్ పని చేసేటట్టు ఉపయోగించాలని ఆదేశించారు. నిర్దేశించిన ఆరు వేల ఎకరాలు సకాలంలో రీ సర్వే పూర్తి చేయాలని గ్రామ సర్వేయర్లను ఆదేశించారు. సర్వేయర్లు సకాలంలో గ్రామాలకు చేరుకొని సర్వే ప్రారంభించాలని ఆదేశించారు. క్రింద స్ధాయి సిబ్బందికి తగు సూచనలు ఇస్తూ నిర్దేశించిన లక్ష్య సాధనకు కృషి చేయాలని, లేని పక్షాన తగు చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు. ఈ సమావేశంలో సహాయ కలక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి వై.మోహనరావు, ఇన్స్పెక్టర్ ఎస్.నాగేశ్వరరావు, డిప్యూటీ ఇన్స్పెక్టర్లు జి.వెంకటరావు, కె.కృష్ణ మోహన్, కె.లక్ష్మణరావు, మండల రెవిన్యూ అధికార్లు, మండల సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో ఉత్సాహంగా ముగిసిన

గిరిజన సంఘం మహాసభ

-స్ఫూర్తినింపిన నాయకుల ప్రసంగాలు

-కర్తవ్యాల అమలుకు సిద్ధమైన నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: అరకులోయలో సున్నం రాజయ్య నగర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న గిరిజన సంఘం ఎనిమిదో రాష్ట్ర మహాసభ శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిసింది. ఈ రెండు రోజులూ సాగిన నాయకుల ప్రసంగాలు ప్రతినిధుల్లో స్ఫూర్తినింపాయి. ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ ఛైర్మన్, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ తొలిరోజు మహాసభల ప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతూ దిశా నిర్దేశం చేశారు. రెండో రోజు ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గిరిజన సంఘం పోరాట ఫలితంగా వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. నేడు గిరిజన హక్కులు, చట్టాలపై దాడి తీవ్రమైందని అన్నారు. గిరిజన మహిళ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును నూతన పార్లమెంట్ భవనం ప్రారంభానికి ఆహ్వానించకుండా అవమానించడం దారుణమన్నారు. గిరిజన గ్రామాల్లో రక్షిత మంచినీరు నేటికీ లేదన్నారు. దీంతో ఆదివాసీలు అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. రెండో రోజు సభలో అధివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ ఛైర్మన్ డాక్టర్ మిడియం బాబూరావు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అప్పలనర్స, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కె.లోకనాధం, మంతెన సీతారాం, పి.బాలదేవ్, ధర్మాన పడాల్ పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీ సభ్యులు

అలరించిన ఆదివాసీ సాంస్కృతిక సంబరాలు

నృత్యం చేస్తున్న కళాకారులు

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభ సందర్భంగా మర్రి కామయ్య వేదికగా మూడు రోజులుపాటు నిర్వహించిన ఆదివాసీ సాంస్కృతిక సంబరాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఏజెన్సీ ప్రాంత వాసులే కాకుండా పర్యాటకులూ వీటిని చూసేందుకు వేలాదిగా తరలివచ్చారు. 250 మంది కళాకారులు రాష్ట్ర నలుమూలల నుంచీ తరలివచ్చి తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రారంభ కార్యక్రమానికి మాజీ ఎంపీ పి.మధు హాజరవగా, ముగింపు కార్యక్రమానికి మిడియం బాబూరావు, తదితరులు హాజరై కళాకారులను, వీక్షకులను ఉద్దేశించి మాట్లాడారు. సాంస్కృతిక ప్రదర్శనల గొప్పతనాన్ని వివరించారు. సంబరాలు చివరి రోజైన గురువారం రాత్రి గిరిజన సంఘం నాయకులు బాబూరావు, సురేంద్ర, పి.అప్పలనర్స, రామారావు, అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, గసభ సర్పంచ్ వి.సునీత, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు తిరుపతిరావు, తౌడన్న, గిరిజన సంఘం అల్లూరి జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు మంగరాజు తుడుము వాయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చొంపి గ్రామానికి చెందిన కళాకారులు మువ్వలా, కుంద ధింసా నృత్యాలతో ఆకట్టుకున్నారు. మారగడ గిరిజన వాయిద్యం, గుమ్మగూడ సంకిడి, రంపచోడవరం పప్పుల నృత్యం, కర్ర కోలాటం, పాటల నృత్యం, పద్మాపురం మోడల్ ధింసా, రామచందర్ విచిత్ర ప్రదర్శన, ఆదివాసీ బాలికల నృత్యం, చొంపి బల్లి నాటకం, సైలోరి చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఆదివాసీ సంస్కృతి సంబరాల కమిటీ చైర్మన్ టి.చిట్టిబాబు, జిల్లా నాయకులు రఘునాథ్, మహేష్, ఎరుకల దొర, ఎం.బాబూరావు, పి.దేముడు, కె.రామారావు, గిరిబాబు, బుజ్జిబాబు, రామన్న, జోషి, సురేష్, మల్లేష్, భగత్‌రామ్, సూర్యనారాయణ, నానిబాబు, మగ్గన్న, హరి పాల్గొన్నారు. సాంస్కృతిక కళా ప్రదర్శన బృందాలను పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజు బాబు, టిడిపి మండల అధ్యక్షులు శెట్టి బాబూరావు, యుటిఎఫ్ నాయకులు చిట్టిబాబు, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు, తదితరులు అభినందించారు.

హాజరైన నాయకులు, ప్రతినిధులు

రోడ్డు పనులను అడ్డుకుంటున్న

టిఏపై చర్యలు తీసుకోవాలి

అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న రోడ్డు పనులను అడ్డుకుంటున్న సంబంధిత టిఏ(టెక్నికల్ అసిస్టెంట్)పై చర్యలు తీసుకోవాలని స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. సంబంధిత శాఖ ఏపిపిడికు పిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం గంగరాజు స్ధానిక విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన ప్రజలకు రహదారి సమస్య పరిష్కరించాలనే లక్ష్యంతో మండలంలోని బీంపోలు పంచాయతీ చిమిడిపల్లి గ్రామానికి ఉపాధి హామీ పథకం కింద రెండు వీధులకు కలుపుకొని ప్రజలు రోడ్డు వేస్తుంటే అడ్డగించడం సరికాదన్నారు. ఈ భూమిని గతంలో భూ స్వాములు కొనుగోలు చేశారని,రోడ్డు వేయకూడదని అదే గ్రామానికి చెందిన టిఏ పనులను అడ్డుకోవడం విడ్డూరమన్నారు. ఈ సమావేశంలో గ్రామస్తులు వెంకటరావు,.దేవా, తదితరులు ఉన్నారు.

టెండర్లు స్వీకరిస్తున్న అధికారులు

ఆశ్రమ, గురుకుల పాఠశాలలకు

సరుకుల సరఫరాకు టెండర్లు ఖరారు

గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్

ప్రజాశక్తి - రంపచోడవరం

రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని 11 మండలాల్లో ఉన్న గిరిజన ఆశ్రమల పాఠశాలలు, గురుకుల పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు న్యాణ్యమైన కోడిగుడ్లు, కోడి మాంసం, కూరగాయలు, పాలు, అరటి పండ్లు సరఫరాకు టెండర్లు ఖరారు చేసినట్లు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇ.జాన్‌రాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో గుత్తేదారులు టెండర్లు దాఖలు చేయగా, తక్కువ ధరలకు టెండర్లు వేసిన వారికి ఖరారు చేశారు. ఈ సందర్భంగా డిడి జాన్ రాజ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం జూన్, జులై, ఆగస్టు మూడు నెలలకు ఈ టెండర్లు ఖరారు చేయడం జరిగిందని తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలకు గుడ్లు సరఫరా చేయుటకు 22 దరఖాస్తులు, చికెన్ సరఫరాకు 22 దరఖాస్తులు, అరటి పండ్లు సరఫరాకు 28 దరఖాస్తులు, పాలు సరఫరాకు ఐదు దరఖాస్తులు, కూరగాయల సరఫరాకు 30 దరఖాస్తులు, గురువుల పాఠశాలలకు గుడ్లు సరఫరాకు 3 దరఖాస్తులు, చికెన్ సరఫరాకు 7 దరఖాస్తులు, అరటి పండ్లు, కూరగాయలు సరఫరాకు 22 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. సరఫరా చేసే గుడ్లు 50 గ్రాములు తప్పనిసరిగా ఉండాలని, స్కిన్‌లెస్ చికెన్ అందించాలని, వాటిని ఆయా పాఠశాలలకు డోర్ డెలివరీ చేయాలని, లేకుంటే టెండర్లు రద్దు చేస్తామని చెప్పారు. ఖరారు చేసిన టెండరుదారులు ఎప్పటికప్పుడు బిల్లుల సమర్పించాలన్నారు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏటిడబ్ల్యూఓలు రామతులసి, సుజాత, శాంతి, జల్లి చెంబుడు, ప్రసాద్, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఆలీషా, ప్రసోనా, సూపరింటెండెంట్ రమణ, సీనియర్ అసిస్టెంట్ చక్రధరరావు టెండరుదారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లు పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన కస్టమ్ హైరింగ్ సెంటర్ గ్రూపులకు ట్రాక్టర్లను స్థానిక ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి శుక్రవారం పంపిణీ చేశారు. ఎటపాక మండలానికి 3, చింతూరు మండలానికి 3, కూనవరం మండలానికి 1, విఆర్.పురం మండలానికి 3 ట్రాక్టర్లు, నాలుగు విలీన మండలాలు కలిపి మొత్తం 10 ట్రాక్టర్లు అందించారు. 40 శాతం సబ్సిడీపై ఈ ట్రాక్టర్లు ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఎంపీపీ, జెడ్పీటీసీ, కూనవరం జెడ్పీటీసీ, ఎటపాక ఎంపీపీ, 4 మండలాల ప్రజా ప్రతినిధులు, నాయుకులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారిగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు మండల వ్యవసాయ శాఖ అధికారిగా డి.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ వ్యవసాయాధికారిగా పని చేస్తున్న కె.కృష్ణ కాంత్ భీమవరం డిఎఓ కార్యాలయంలో టెక్నికల్ ఎఓగా బదిలీపై వెళ్లారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

గ్రామ వాలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం చింతూరు మండలం గ్రామ వాలంటీర్లు వందనం కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను ఎంపికైన వాలంటీర్లకు శాలువా కప్పి, మెడల్స్, సర్టిఫికెట్లు అందించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్నారని తెలిపారు. వాలంటీర్లు మరింత బాధ్యతాయుతంగా పని చేసి, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతూరు జడ్పీటీసీ చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ సుధాకర్(చిన్ని), చింతూరు సర్పంచ్ కారం కన్నారావు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సీలేరు

ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో పొలం గట్టు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమారాణి మాట్లాడుతూ జాతీయ హామీ ఉపాధి పథకం పనుల్లో భాగంగా మొదట విడతలో ప్రభుత్వం రూ.5.86 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధి చంద్రుపల్లి, లైకాన్ పూర్, చింతపల్లి క్యాంపులలో పొలం గట్లు పనులు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, ఇన్‌ఛార్జి సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, దుప్పులవాడ ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఇన్‌ఛార్జి ఫీల్డ్ అసిస్టెంట్ వి.గురునాధరావు, కోడా కొమ్ములు పాల్గొన్నారు

ఉపాధి హామీ పనులను ప్రారంభిస్తున్న సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో మారుమూల పంచాయతీ కేంద్రం గోమంగిలో శుక్రవారం ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిం చారు. గోమాంగి, కుమ్మరివీధి, సరియపల్లి, బోయరాజుల, రాయిమామిడి గ్రామాల్లో పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసున్నారు. రాయిమామిడి గ్రామంలో వైస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.గోమాంగి సర్పంచ్ కొర్ర జట్టో అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ , గడప గడపకు వచ్చి సమస్యలు తెలుసుకొని ప్రభుత్వానికి నివేదించి పరిష్కారం చేస్తామన్నారు. గోమాంగిలో మంచినీటి బోరు వెల్ , సి సి ర్యాంపునకు రూ. 40 లక్షలు విడుదల చేస్తున్నానని తెలిపారు. కుమ్మరివీధి, రాయిమామిడి, గోమాంగిలో బస్సు స్టాఫ్ నిర్మించుటకు నిధులు మంజూరు చేశారు. పథకాలు అందకుంటే గ్రామ వాలంటీర్‌లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కూడా బొంజుబాబు, రాష్ట్ర వైసిపి కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ కొంటా సూర్యనారాయణ, వైస్ సర్పంచ్ కూడా మత్య కొండబాబు, మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేష్, మాజీ వైస్ ఎంపీపీ అప్పారావు, మాజీ సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు పాంగి సింహాచలం, ఇంజినీర్ సంజీవరావు, ఈఓఆర్‌డీఓ నరసింగరావు పాల్గొన్నారు.

ఏజెన్సీ పనసకు గిరాకీ

ప్రజాశక్తి -అనంతగిరి: ఏజెన్సీ అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంతంలో పండే పనసకు భలే గిరాకీ ఉంటుంది. ఈ పనస ప్రతి ఏడాది జూన్ నుండి సెప్టెంబర్ నెల చివరి వరకు పలుచోట్ల లభిస్తుంది. కొంతమంది రైతుల భూములలో ఈ పనస చెట్లు తాతల కాలం నుంచి ఉన్నాయి. పనస పండ్లను వారపు సంతలకు తీసుకెళ్లి విక్రయిస్తారు. మండలంలో అనంతగిరి ఘాట్ రోడ్, కాశీపట్నం, శివలింగపురం, డమ్ముకు, బొర్రా జంక్షన్, అనంతగిరిలో పలువురు రైతులు పనసకాయల్ని విక్రయిస్తున్నారు.అనంతగిరి, అరకు పర్యాటక కేంద్రాలను తిలకించేందుకు వచ్చే విదేశీ, ఇతర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. ఒక్కొక్క పనసకాయ రకాన్ని బట్టి రూ.100. నుండి 250 వరకు ధర పలుకుతుంది. అనంతగిరి, వాలసీ, గుమ్మ, పెద్దబిడ్డ, లుంగపర్తి, వెంగడ, బొర్రా, కొండిబా పంచాయతీ గ్రామాల్లో అధికంగా పనసక కాయలు లభిస్తాయి.



కాంటూరు పేరుతో నిర్వాసితులను మోసం చేయొద్దు

వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య

ప్రజాశక్తి-కూనవరం

కాంటూరు లెక్కలు పేరు చెప్పి పోలవరం నిర్వాసితులను మోసం చేయొద్దని సిపిఎం నాయకులు, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య అన్నారు. మండలంలోని గొమ్ము అయ్యవారిగూడెంలో ధన్నూరి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో పెంటయ్య మాట్లాడుతూ పోలవరం వల్ల మునిగిన ప్రతి గ్రామాన్ని ముంపు గ్రామంగా పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంటూరుతో సంబంధం లేకుండా గతేడాది వచ్చిన వరదను లెక్కగా తీసుకొని మునిగిన ప్రతి గ్రామానికి, నిర్వాసితుడికి న్యాయం చేయాలని కోరారు. గత సంవత్సరం వరదలకు దెబ్బతిన్న ఇళ్లకు ఇప్పటికి నష్టపరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితులకు చేస్తున్న అన్యాయాన్ని దేశానికీ చాటి చెప్పడానికి ఈ నెల 20 నుండి సిపిఎం మహాపాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. ఈ పాదయాత్రలో ప్రతి నిర్వాసితుడు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, ఎంపీటీసీ జయసుధ, కర్నాటి శ్రీనివాసరావు, జోడే రాజు నారాయణరావు, బాబు, పొద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య

శరవేగంగా బిటి రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం సీలేరు నుంచి చల్లనశిల్ప వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఆర్ అండ్ బి జెఈ భరతుడు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు సదరు కాంట్రాక్టర్ పాటించే విధంగా బీటీ రోడ్డు పనులను స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం సీలేరు నుంచి రెండు కిలోమీటర్లు బీటీ రోడ్డు పనులు జరిగాయాని, చల్లన శిల్ప వరకు మరొక రెండు కిలోమీటర్లు బీటీ రోడ్డు పనులు పూర్తి చేయడానికి చర్యలు వేగవంతం చేశామని చెపారు. మరో రెండు మూడు రోజుల్లో ఈ పనులు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సీలేరు సిపిహెచ్ క్యాంపు ప్రమాద మలుపు నుంచి స్థానిక జలవిద్యుత్ కేంద్రం వరకు మరో రెండు కిలోమీటర్లు బీటీ రోడ్డు పనులు త్వరలో చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. దారకొండ ప్రధాన ఘాట్ రోడ్లో నీరు నిలిచిపోయే ప్రదేశాల్లో సిసి రోడ్డు పనులు సదరు కాంట్రాక్టర్ చేపట్టి కొంతమేరకు జరిగాయని తెలిపారు. కొన్ని సాంకేతికపరమైన కారణాలవల్ల కాంట్రాక్టుకు బిల్లులు రావడంలో జాప్యం జరుగుతుందన్నారు. దీంతో సీసీ రోడ్డు పనులు పూర్తి కావడానికి మరి కొంత సమయం పట్టవచ్చునని చెప్పారు. ఈ పనులు కూడా పూర్తిస్థాయిలో జరిగే విధంగా ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారని ఆర్ అండ్ బి జేఈ భరతుడు పేర్కొన్నారు.

సీలేరు నుంచి చల్లన శిల్ప వరకు జరుగుతున్న బిటి రోడ్డు పనులు

పులి దాడిలో గేదె మృతి

ప్రజాశక్తి- మోతుగూడెం

చింతూరు మండలం, సుకుమామిడి గ్రామం వద్ద అటవీ ప్రాంతంలో పులి దాడి చేసి ఓ గేదెను చంపేసింది. ఈ ప్రాంతంలో తీవ్ర దుర్వాసన వస్తున్న పశువును గ్రామస్తులు గమనించారు. గ్రామస్తుల సమాచారం మేరకు అటవీ శాఖ రేంజర్, టిఎఫ్ఓ, డిఆర్ఓ, గార్డ్స్ ఆ ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. పెద్దపులి దాడి వల్లే ఈ గేదె మరణించిందని నిర్ధారణ చేశారు. చుట్టుపక్కల పెద్దపులి పాదముద్రలను గుర్తించారు. తాజాగా ఉన్న పాదముద్రలను చూసి పెద్దపులి పరిసర ప్రాంతాల్లోనే ఉందని ఒక నిర్ధారణకు వచ్చారు.

అడ్డాకులకు అందని గిట్టుబాటు ధర!

కొనుగోలు చేయని జిసిసి .. గత ఏడాదికన్నా తగ్గిన ధర
సిండికేట్‌గా వ్యాపారులు .. నష్టపోతున్న గిరిజనులు

వాహనంలో తరలిస్తున్న అడ్డాకులు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: గిరిజనులు పండించిన లేక సేకరించిన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం జిసిసి సంస్థను ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం ఆ సంస్థ గిరిజనులు పండించిన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయక పోవడంతో వారపు సంతల్లో దళారీలను నమ్మి గిరిజనులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. మైదాన ప్రాంత వ్యాపారస్తులు ఏజెన్సీ ప్రాంతంలోని వారపు సంతల్లోకి వచ్చి తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడ అధిక లాభాలకు అమ్ముకుంటున్నారు. గతంలో గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తుల్లో అడ్డాకులను కూడా జిసిసి కొనుగోలు చేసేది. గిరిజనులకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసేవారు. సుమారు గత ఆరేడేళ్ల నుంచి జిసిసి కొనుగోలు చేయక పోవడంతో మైదాన ప్రాంత వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. వారంతా సిండికేట్ అయ్యి కొనుగోలు చేస్తుండటంతో అడ్డాకులు సేకరించిన గిరిజనులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

ప్రయాసతో అడ్డాకుల సేకరణ

కుటుంబ సమేతంగా నలుగురైదుగురు గిరిజనులు వారం రోజుల పాటు గ్రామాలకు సమీపంలోని అటవి ప్రాంతానికెళ్ళి అడ్డాకులను సేకరిస్తారు. ఆ తర్వాత చిన్న చిన్న కట్టలు కట్టి ప్రతిరోజు ఎండలో ఆరబెడతారు. ఆ తర్వాత వారపు సంతలకు విక్రయించడానికి తీసుకెళ్లే ముందురోజు అడ్డాకులను దిండ్లిలుగా పెద్ద కట్టలను కట్టి సంతలకు తరలిస్తారు. మారుమూల గ్రామాల నుంచి వారపు సంతలకు తరలించాలంటే సుమారు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరం ఉండటంతో ప్రైవేట్ వాహనాల్లో తరలిస్తున్నారు. ఒక్కో అడ్డాకుల కట్ట (దిండి) కు రూ.80 నుంచి రూ.100ల లగేజీ చార్జీ వాహనదారులు తీసుకుంటున్నారు. సుమారు 30 కేజీల అడ్డాకుల కట్టకు రూ.700 ధర వస్తుంది.

వారం రోజుల కష్టానికి రేటు గిట్టుబాటు కాకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది 30 కేజీల అడ్డాకుల కట్టకు రూ 1000 ధరతో కొనుగోలు చేయగా, ఈ ఏడాది కేవలం.రూ 700నుంచి 800లకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో, రైతులు నష్టపోతున్నారు. డుంబ్రిగూడ మండలంలో శుక్రవారం జరిగిన అరకు వారపు సంతలో సుమారు 30 కిలోల అడ్డాకుల కట్టకు రూ.700 చొప్పున కొనుగోలు చేశారు. దీంతో గిట్టుబాటు కాలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాల్సిన జిసిసి వీటిని కొనుగోలు చేయడం మానేయడంతో మైదాన ప్రాంతం నుంచి వస్తున్న వ్యాపారులు సిండికేట్ అయ్యి వారికి నచ్చిన ధరలో కొనుగోలు చేస్తూ మైదాన ప్రాంతానికి తరలిస్తున్నారు. దీంతో, వారం రోజుల పాటు గిరిజనులు శ్రమిస్తున్నా గిట్టుబాటు ధర లభించ లేదు. ఈ విధంగా గిరిజనుల కష్టాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అడ్డాకులను జిసిసి ద్వారా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

ఫిర్యాదుల పరిష్కార నివేదిక ఇవ్వాలి

కలెక్టర్ సుమిత్ కుమార్

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: స్పందనలో అందిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించాల్సిందేనని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలక్టర్ మాట్లాడుతూ, అందిన ప్రతి ఫిర్యాదుకు సంబంధించి విచారణాదికారిని నియమించాలని, అనంతరం చేపట్టిన పరిష్కార వివరాలను ఫిర్యాదు దారుకు తెలియ చేయాలని సూచించారు. ఒక వేళ ఫిర్యాదు పరిష్కారం కాకపోతే అందుకు కారణాలను కూడా ఫిర్యాదుదారుకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రతి అధికారి, సిబ్బంది తప్పనిసరిగా ఫేషియల్ రెకగ్నిషన్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయాల్సిందేనని, దీని ఆధారంగా మాత్రమే జీతభత్యాలు చెల్లింపులు చేయాలని, అందుకు విరుద్ధంగా డ్రా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

139 ఫిర్యాదులు స్వీకరణ

అరకువేలి మండలం కొత్తభల్లుగుడ పంచాయతి గర్వగూడ గ్రామం నుండి దురియా రామచందర్ అనే అర్జీదారుడు జాతీయ రహదారి నిర్మాణం సందర్భంగా సర్వే నెం. 47-2బి భూమికి సంబంధించి నష్ట పరిహారం ఇప్పించాలని కోరాడు.కొయ్యూరు మండలం కొండగోకరి పంచాయతి రత్నంపేట గ్రామం సిఆర్పి గా పని చేస్తూ చనిపోయిన రాజబాబు స్థానంలో ఏదైనా స్కూలులో ఉపాధి కల్పించాలని భార్య ఎర్రమ్మ దరఖాస్తు సమర్పించారు.పాడేరు గ్రామంలో తాగునీరు సమస్య పరిష్కరించాలని కోరారు. కొయ్యూరు మండలం నల్లగొండు పంచాయతి కొత్త బోయ గ్రామస్థులు గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. హుకుంపేట మండలం సోభాకోట పంచాయతి ఈదేలగొండ గ్రామస్తులు ఆర్లడ నుండి ఈదెలగొండి వరకు రోడ్డు సదుపాయం కల్పించి, పాఠశాల మంజూరు చేయాలన్నారు.పాడేరు మండలం గబ్బంగి పంచాయతి గబ్బంగి గ్రామస్తులు అటవీ హక్కు పత్రం మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలక్టర్ జె.శివశ్రీనివాసు, ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ వి.అభిషేఖ్, అసిస్టెంట్ కలక్టర్ ఆశుతోష్ శ్రివాస్తవ, డి.ఆర్.ఓ. పి అంబేద్కర్, ప్రత్యేక ఉప కలక్టర్ శర్మ, ఎపిఓ ప్రభాకర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సేవా పురస్కారాలు ఏవీ? : స్పందనలో కలెక్టర్‌కు వాలంటీర్ల గోడు

పాడేరు: గ్రామాల్లో నిరంతరం ప్రజాసేవతో విధులు నిర్వహిస్తున్న తమకు సేవా పురస్కారాలు దక్కలేదని జిల్లాలోని పలువురు వాలంటీర్లు శుక్రవారం స్పందనలో జిల్లా కలెక్టర్ ముందు తమ గోడును వెల్ల బోసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 352 సచివాలయాలలో 5547 మంది వాలంటీర్లు విధులు నిర్వహిస్తుండగా కేవలం 3100 మంది వాలంటీర్లకు మాత్రమే సేవామిత్ర, 53 మందికి సేవా రత్నగా, 108 మందికి సేవావజ్రగా పురస్కారాలు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పొందారు. పాడేరు నియోజక వర్గం నుండి 589 మందికి సేవ మిత్రలుగా, 25 మందికి సేవా రత్నాలుగా, 5 గురికి సేవా వజ్రలుగా ఎంపిక చేశారన్నారు. అరకు నియోజకవర్గం పరిధి ఆరు మండలాల్లో 624 మందిని సేవా మిత్రగా, 30 మందికి సేవా రత్నాలుగా, ఐదుగురికి సేవా వజ్రలుగానూ, రంపచోడవరం పరిధిలోని 11 మండలాల్లో 1887 మందికి సేవా మిత్రలుగా 108 మందికి సేవా రత్నలుగా, ఐదుగురికి సేవా వజ్రలు గా ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు.. మరి మిగిలిన వారికి పురస్కారాలు ఇవ్వకపోవడం ఏమిటని శుక్రవారం జిల్లా కేంద్రం పాడేరులో స్పందనలో వాలంటీర్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు వినతిపత్రం సమర్పించి తమ ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన కలెక్టర్ అతి త్వరలో సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొమ్ము సురేష్ బాబు, అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, కొండబాబు పెద్దసంఖ్యలో వాలంటీర్లు పాల్గొన్నారు.

12న రాష్ట్రపతితో గిరిజనుల భేటీ

ప్రజాశక్తి -మధురవాడ : భారత ప్రథమ పౌరురాలు, రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఆహ్వానం మేరకు ఈనెల 12న న్యూఢిల్లిలో ఆమెతో భేటీ అయ్యేందుకు విశాఖ నుంచి రాష్ట్రానికి చెందిన 180 మంది గిరిజనులు తరలివెళ్లారని గిరిజన సంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ మిషన్ డైరెక్టర్ ఈషా రవేంద్రబాబు తెలిపారు. రాష్ట్రపతితో భేటీకి దేశవ్యాప్తంగా 1500 మందిని ఎంపిక చేయగా, అందులో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ఐటిడిఏల నుండి 180 పివిటిజి గిరిజనులు ఉన్నారని తెలిపారు.

దేశంలో అభివద్ధికి దూరంగా, అత్యంత దయనీస్థితిలో జీవనం సాగిస్తున్న ఆదిమ జాతి గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ వారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సమావేశానికి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఏ నుండి దొంగ్రియా బోన్డ్, బోడో గదబ, గొట్టోబ్ గదబ, భోన్డ్ పోర్ట, కొండా రెడ్డి, కుట్టి బోన్డ్, పారంగి పోర్జ తదితర ఏడు తెగలకు చెందిన 120 మంది, పార్వతీపురం ఐటిడిఎ నుంచి బోడో గదబ, గొట్టోబ్ గదబ రెండు తెగలకు చెందిన 30 మంది, రంపచోడవరం, చింతూరు ఐటిడిఏ నుండి కొండా రెడ్డి తెగకు చెందిన 18 మంది, సీతంపేట ఐటిడిఎ నుంచి కొండ సవర తెగకు చెందిన 10 మంది, కె ఆర్ పురం ఐటిడిఎ నుంచి కొండారెడ్డి తెగకు చెందిన ఇద్దరిని ఎంపిక చేశారన్నారు.

రాష్ట్రపతితో భేటీకి ఢిల్లీ వెళుతున్న ఆదిమజాతి గిరిజనులు

వీరికోసం ఈనెల 9వ తేదీన అర్ధరాత్రి 12:25 గంటలకు విశాఖపట్నం నుండి న్యూఢిల్లీ వెళ్లే హీరాకుడ్ రైలు ఎక్స్‌ప్రెస్‌లో మూడు ప్రత్యేక అదనపు ఎసి బోగీలు ఏర్పాటు చేశారన్నారు. ఈ మేరకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేశారని ఈసా రవీంద్రబాబు తెలిపారు.

విజ్ఞానం.. వినోదం...

ఉత్సాహంగా సమ్మర్ క్యాంప్
సందడిగా పాల్గొన్న చిన్నారులు
- విజయవంతంపై హర్షం

బొమ్మలు గీస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: వేసవి సెలవుల్లో విద్యార్థులు ఖాళీగా ఉంటూ బయటికి వెళ్లకుండా ఉండేందుకు గాను ప్రభుత్వం జిల్లా శాఖ గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో దోహద పడుతున్నాయి. ప్రస్తుతం ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో చిన్నారులు బయటకెళ్ళి వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు మరింత ఉపయోగకరంగా ఉంది. ఈ విజ్ఞాన శిబిరంలో భాగంగా ప్రభుత్వం జిల్లా శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్, కుర్చీ, రన్నింగ్, చెస్, క్యారమ్స్, స్కిప్పింగ్ వంటి ఆట, పాటలతో పాటు పలు రకాల ఆటల పోటీలను నిర్వహిస్తుంది.

సెలవుల్లో గ్రామాల్లోనే ఉండటంతో ఈ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.గ్రంథాలయంలో కథల పుస్తకాలు చదువుతూ ఒకరికొకరు చెప్పుకుంటూ విద్యార్థులు అవగాహన పరుచుకుంటున్నారు. గతంలో గ్రంథాలయం అంటే గిరిజన ప్రాంతంలో రోజు వారిగా వెళ్లి దిన పత్రికలతో పాటు ఇతర పుస్తకాలు చదివి వచ్చేవారు. ప్రస్తుతం వేసవి సెలవుల్లో ఇటువంటి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుండటంతో ఎలిమెంటరీ విద్యార్థుల నుంచి హైస్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు గ్రంథాలయంపై అవగాహన పెరిగి వివిధ పుస్తకాలు చదువుతూ విజ్ఞానాన్ని పెంచుకుంటున్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు ఉపాధ్యాయ పుస్తకాలతో పాటు పంచాయతీ కార్యదర్శి, విఆర్, గ్రూప్ వన్, గ్రూప్ టూ తో పాటు బీఇడీ, డైట్ పాటు పలు కాంపిటేటివ్ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు వివిధ రకాల పుస్తకాలు సైతం అందుబాటులో ఉన్నాయి. కాంపిటేటివ్ పరీక్షల్లో పాల్గొనే నిరుపేద విద్యార్థులు పుస్తకాలు కొనుక్కోలేక గ్రంథాలయాల్లో ప్రిపేర్ అవుతున్నారు. ఈ గ్రంథాలయంలో కాంపిటీటివ్ పుస్తకాలు చదివి అనేకమంది ఉపాధ్యాయ, రెవెన్యూ, పంచాయతీ శాఖలతో పాటు వివిధ రంగాల్లో ఉద్యోగాలు పొంది స్థిరపడిన వారున్నారు. ఏదేమైనప్పటికీ ప్రభుత్వ శాఖ గ్రంథాలయాలు ప్రాంతంలో నిరుపేద విద్యార్థులకు, నిరుద్యోగులకు ఎంతో దోహద పడుతున్నాయి.

చిన్నారులకు ఎంతో ఉపయోగం

సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఉపయోగకరంగా ఉండేందుకుగాను ఆటపాటలతో పాటు విజ్ఞానాన్ని అందించేందుకు నెలరోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. చిన్నారులతో పాటు విద్యార్థులు సైతం ఉత్సాహంగా పాల్గొని ఉపయోగించుకున్నారు. చిన్నారులను ప్రోత్సహించేందుకుగాను గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 11న బహుమతులను ప్రధానం చేయనున్నాం.

-ఎస్ సునీత , గ్రంథాలయ అధికారిణి, డుంబ్రిగుడ శాఖ గ్రంథాలయం

స్పోర్ట్స్ కిట్ అందజేస్తున్న విక్రమ్

బాక్సింగ్ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్ అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆరో యూత్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన బుగత చంద్రశేఖర్ (చంటి), పి.దేవకుమార్‌లకు వైసిపి యువజన విభాగం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జ్ అవనాపు విక్రమ్ స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు. ఇటీవల విశాఖ రైల్వే స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి యూత్ బాక్సింగ్ చాంఫియన్ షిప్ డిఆర్ఎం కప్ పోటీల్లో చంద్రశేఖర్ హెవీ వెయిట్ (86-92) పోటీల్లో ప్రత్యర్థులను నాకౌట్ చేసి బంగారు పతకాన్ని సాధించారు. రాష్ట్ర స్థాయిలో రాణించిన చంద్రశేఖర్ (చంటి) సిక్కిం రాష్ట్రంలో గ్యాంగ్‌టాక్ జిల్లాలో ఈ నెల 13 నుంచి 19 వరకు జరగబోయే నేషనల్ యూత్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు డోల మన్మధకుమార్, సంపత్ రాజుల పర్యవేక్షణలో కోచ్ బి.ఈశ్వర్‌రావు శిక్షణలో జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమవుతున్న వీరికి అవసరమైన పూర్తి స్థాయి స్పోర్ట్స్ కిట్‌ను విక్రమ్ అందించడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. కార్యక్రమంలో ముని లక్ష్మణరావు, సంపత్ రాజు, ఎన్నింటి నరసింగరావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శుక్రవారం విశాఖలోని ఇండియన్ కోస్ట్ గార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. 120 మంది కోస్ట్ గార్డ్ సిబ్బంది, వారి కుటుంబీకులు రక్తదానం చేశారు. ప్రపంచ రక్తదాన దినోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు.

బోగస్ స్కాట్స్ అండ్ గైడ్స్ సంస్థను నమ్మొద్దు

- 'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 7న 'ఉద్యోగాల పేరిట యువతకు గాలం' శీర్షికతో ప్రజాశక్తి టాబ్లాయిడ్‌లో హిందుస్తాన్ స్కాట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్‌పై వచ్చిన కథనంపై రాష్ట్ర భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ చీఫ్ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ స్పందించారు. ఆ నకిలీ సంస్థను ఎవరూ నమ్మొద్దని ఆయన కోరారు. ఉద్యోగాల పేరిట వెలువడుతున్న ప్రకటనలు చూసి మోసపోవద్దని అన్నారు.

ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై దాడులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను కలిగి ఉన్న దుకాణాలపై జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు దాడి చేశాయి. అపరాధ రుసుం వసూలు చేశాయి. నగర పరిధిలో ప్లాస్టిక్ అమ్మే దుకాణాలుపైనా, వాడే వర్తకులపైనా ఈ బృందాలు వేర్వేరుగా ఎనిమిది జోన్లలోనూ దాడులు నిర్వహించాయి. దుకాణదారుల నుంచి ప్లాస్టిక్ వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 58 దుకాణాదారుల నుంచి రూ.లక్షా 16 వేలా 300ను అపరాధ రుసుము కింద వసూలు చేశారు. 130.31 కిలోల ప్లాస్టిక్‌ను పట్టుకున్నట్టు అదనపు కమిషనర్ తెలిపారు. విశాఖ నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు జివిఎంసి కమిషనర్ ఎంతో ప్రయత్నిస్తున్నారని అన్నారు. నగర పరిధిలో చిన్నా, పెద్ద దుకాణదారులు నిషేధిత ప్లాస్టిక్‌ను అమ్మడం, వాడకం చేసినట్లయితే అపరాధ రుసుంతో పాటు చర్యలూ ఉంటాయని హెచ్చరించారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మూడో జోన్ ఎంవిపి కాలనీ పరిధిలోని టిటిడి కల్యాణ మండపం నుంచి ఉషోదయ జంక్షన్ వరకు రూ.29 లక్షల వ్యయంతో తలపెట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

11న అమిత్ షాకు నిరసన సెగ

సన్నద్ధమవుతున్న విశాఖ ప్రజానీకం

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విరమించుకుంటున్నట్టు ప్రకటించాల్సిందే : ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

బిజెపిది విద్రోహ పాలన, కేంద్ర మంత్రి పర్యటనను అడ్డుకుంటాం : వామపక్షాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అన్న సామెతను విశాఖ పర్యటనకు బిజెపి అగ్రనేత అమిత్ షా రానున్న తరుణాన ఈ ప్రాంత వాసులు గుర్తుచేసుకుంటున్నారు. విశాఖలో స్టీల్‌ప్లాంట్, డిసిఐ, పోర్టు, ఎల్ఐసి ఆస్తులు, రైల్వే సహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలపై కత్తిగట్టిన బిజెపి ఇక్కడ సభ పేరిట కాలుపెట్టే యత్నాలను ప్రజలంతా నిరసిస్తున్నారు. ఈ నెల 11న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా విశాఖ పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా విశాఖ కార్మికవర్గం, ప్రజానీకం, వామపక్షాలు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నాయి. 2014 నుంచి 2023 వరకూ బిజెపి పాలన అంతా ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేయడం, ప్రజల ఆర్థిక వనరులను కొల్లగొట్టి కార్పొరేట్లకు ఫణంగా పెట్టడమే పనిగా సాగడంతో అన్ని తరగతుల ప్రజానీకం తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిర్ణయం, విశాఖకు రైల్వే జోన్ ఇస్తానని చెప్పి మోసగించిన వైనం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తికి మోకాలడ్డుతూ నిధులివ్వకుండా ఎండగడుతున్న తీరుపై విశాఖపట్నం, ఉత్తరాంధ్రకు చెందిన మేధావులు, వామపక్ష నేతలు ఆగ్రహంతో ఉన్నారు. ఈ క్రమంలోనే సిపిఎం, సిపిఐ ఇతర వామపక్ష పార్టీల ఆధ్వర్యాన ఈ నెల 11 ఆదివారం విశాఖలో నిరసనలకు పిలుపునిచ్చారు. రైల్వే డిఆర్ఎం ఆఫీసు నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వరకూ వామపక్షాలు నిరసన తెలియజేసేందుకు ఇప్పటికే సిద్ధమయ్యాయి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోనూ దశల వారీ కార్యాచరణతో కార్మికులు కదులుతున్నారు. ఈ నెల 10న ప్లాంట్‌లోని వివిధ డిపార్టుమెంట్లలో కరపత్రాలు పంచుతూ ప్రైవేటీకరణ వ్యతిరేక ప్రచారం సాగిస్తారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రకటించాలన్న డిమాండ్‌తో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, నిర్వాసితుల సంఘాలు నిరసన తెలపనున్నాయి. 11న కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం వద్ద వేల మంది కార్మికులతో అమిత్ షా పర్యటనపై నిరసన హోరు వినిపించేందుకు రంగం సిద్ధమవుతోంది.

అమిత్ షా సభ ఏర్పాట్లును పరిశీలిస్తున్న పోలీసాధికారులు

బిజెపి విద్రోహ పాలన ఇలా..

దేశంలో బిజెపి 2014లో అధికారంలోకి వచ్చే క్రమంలో ఏటా 2 కోట్లు ఉద్యోగాలిస్తామని, నల్ల డబ్బును బయటకు తీసి ప్రజల అకౌంట్లలో ప్రతి ఒక్కరికీ రూ.15 లక్షలు చొప్పున వేస్తామని ప్రకటనలు గుప్పించింది. గెలుపు అనంతరం ఇవేవీ చేయకుండా కార్పొరేట్లకు రూ.లక్షల కోట్ల వరాలు ఇచ్చింది. ప్రభుత్వ రంగ సంస్థలైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ), ఎయిర్ ఇండియాలను ప్రైవేటీకరణ చేసి కార్పొరేట్లకు కట్టబెట్టే విధానం తీసుకుంది. రెండేళ్లుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి, సిపిఎం, ఇతర వామపక్షాలు రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపడుతున్నాయి. అయినప్పటికీ మోడీ సర్కారులో చలనం లేదు. ఇంకోవైపు ఇప్పటికే వాల్తేరు రైల్వే డివిజన్‌ను బిజెపి ప్రభుత్వం లేపేసింది. ఇస్తానన్న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు మొండిచెయ్యి చూపుతూనే ఉంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు అమిత్ షా పర్యటనపై గుర్రుగా ఉన్నారు.

అమిత్ షా పర్యటన ఇలా..

ఢిల్లీ నుంచి నేరుగా ఈ నెల 11 ఆదివారం సాయంత్రం 5 గంటలకు విశాఖకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేరుకుంటారు. రైల్వే గ్రౌండ్స్‌లో అప్పటికే బిజెపి శ్రేణులు సమీకరించిన జనంతో బహిరంగ సభ నిర్వహిస్తారు. ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు. సుమారు రాత్రి 7 గంటల వరకూ ఈ సభ జరుగనుంది. తొమ్మిదేళ్ల బిజెపి పాలన విజయోత్సవాలుగా ఈ సభకు పేరుపెట్టారు. ఎపిలో రాజకీయ శక్తిగా ఎదిగేందుకు అమిత్ షా రాష్ట్ర పర్యటన చేస్తున్నారంటూ.. ఆయనతో పాటు సిఎం రమేష్ హాజరవుతారంటూ బిజెపి నేతలు విశాఖలో శుక్రవారం ప్రకటించారు. ఆ రోజు రాత్రి 8 గంటలకు విశాఖ పోర్టు గెస్ట్‌హౌస్‌లో విశాఖ జిల్లాకు చెందిన బిజెపి ముఖ్య నేతలతో అమిత్ షా సమావేశం అవ్వనున్నారు. 2024లో రాష్ట్రంలో జరుగనున్న ఎన్నికల నేపథ్యలో పొత్తుల వ్యవహారంపై పార్టీ శ్రేణులతో చర్చించే అవకాశం ఉంది.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరంలో 16 ఫిర్యాదులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధి ఎనిమిది జోన్లలో ఉన్న పట్టణ ప్రణాళిక విభాగాల్లో ఫిర్యాదుల పరిష్కారానికి జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ మార్గనిర్దేశకంలో శుక్రవారం ప్రత్యేకంగా నిర్వహించిన 'టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం' కార్యక్రమానికి 16 వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగం డిసిపిలు నరేంద్రనాథ్ రెడ్డి, కెఎస్.రత్నకుమార్, పద్మజ, ఎసిపిలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలపైనా, టౌన్ ప్లానింగ్ విభాగంపై ఎలాంటి ఫిర్యాదులున్నా టోల్ ఫ్రీ నెంబర్ 1800 4250 0009కు ఫోన్ చేసి తెలియజేయవచ్చునని అధికారులు తెలిపారు. వాట్సప్ నెంబరు కూడా అందుబాటులో ఉందన్నారు.

చిన్నారులనుద్దేశించి మాట్లాడుతున్న నిర్వాహకులు

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ విసిసి జగదాంబ జోన్ పరిధిలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన చిన్నారులకు శుక్రవారం ఉదయం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో బహుమతులు అందజేశారు. రొటేరియన్, ఇంటరాక్ట్ ఛైర్ మోదంబికా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి), రోటరీ కలసి ఇంటరాక్ట్ క్లబ్ ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విసిసి వ్యవస్థాపకులు డాక్టర్ కోరెడ్ల రమాప్రభ, జోన్ కన్వీనర్ ఎల్లాజీ, జాహ్నవి, తులసీ, మణి, దుర్గ, అనురాధ, సరోజిని, నరేష్, శ్రీలక్ష్మి, జయంత్ పాల్గొన్నారు. జోన్ పరిధిలో ఉన్న కొబ్బరితోట, కల్లుపాకలు, కృష్ణా గార్డెన్, పందిమెట్ట, అంథోనీ నగర్, జగదాంబ ప్రాంతాల నుంచి చిన్నారులు హాజరయ్యారు.

కమిటీ సభ్యులతో సమావేశమైన విశాఖ కలెక్టర్ మల్లికార్జున

మరో 194 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో విధులు నిర్వహిస్తున్న 194 మంది జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్ ప్రతిపాదనలను ఆమోదించినట్టు విశాఖ జిల్లా కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. తన ఛాంబర్‌లో శుక్రవారం ఉదయం జిల్లా అక్రిడిటేషన్ కమిటీ రెండో సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో విధులు నిర్వహిస్తున్న ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులను మొదటి విడతగా 301 మంజూరు చేశామని, శుక్రవారం జరిగిన సమావేశంలో రెండో విడతగా 194 వెరసి 495 కార్డులను ఇప్పటి వరకు మంజూరు చేశామని తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న, ఇప్పటి వరకూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయని జర్నలిస్టులు ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి అక్రిడిటేషన్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు

కెజిహెచ్ డౌన్‌లోగల డాల్ఫిన్ డయాగ్నొస్టిక్స్ సర్వీసెస్ సెంటరులో శనివారం ఉదయం 10 గంటల నుంచి ఈ ఏడాది అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులకు 56 రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజిని ప్రారంభిస్తారని చెప్పారు. వైద్య పరీక్షలు చేయించుకునే జర్నలిస్టులు డాల్ఫిన్ డయాగ్నొస్టిక్స్ సర్వీసెస్‌లో శనివారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రోజుకు 30 మందికి వైద్య పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు, వి.మణిరామ్ తదితరులు పాల్గొన్నారు.